విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

జగనన్న కాలనీ ప్రారంభం

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నంలో మేకవాని పాలెం నందు అక్క చెల్లెమ్మల సొంతింటి కలను నిజం చేస్తూ వైయస్సార్ జగనన్న కాలనీ లో 116 ఇళ్ల నిర్మాణం పూర్తయిన సందర్భంగా గురువారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, నగరపాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, వైఎస్ఆర్సిపి యూత్ జోన్ ఇంచార్జ్ పేర్ని కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని గృహ నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురికాబడి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా మోడల్ కాలనీలను రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిర్మిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజాబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును
వ్యతిరేకించండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై విద్యుత్ ఛార్జీల పెంపుదల పేరుతో ప్రజలకు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నాయని సీపీఐ, సీపీఎం మచిలీపట్నం నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా గురువారం సీపీఐ, సీపీఎం మచిలీపట్నం కమిటీల ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై మూడు రకాల బారాలు వేస్తుందని, ఇప్పటికే అనేక నిత్యవసర సరుకులు రేట్లు పెరిగి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న ఈ తరుణంలో కరెంటు ఛార్జీలు పెంచడం సరైనది కాదని, సర్‌ఛార్జీ రూపంతో వేస్తున్న అదనపు విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం కరెంట్ చార్జీల పెంపుదల పేరుతో 1400 కోట్లు ప్రజలపై భారం వేసిందని అన్నారు. విద్యుత్ బారాలకు వ్యతిరేకంగా ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు కోనేరు సెంటర్లో సీపీఐ, సీపీఎం వామపక్షాల ఆధ్వర్యంలో ప్రజాబ్యాలెట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎంఎల్) నాయకులు బి .వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ శొంఠి మాతృవియోగం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక 29వ వార్డు బేతవోలుకి చెందిన మాజీ కౌన్సిలర్ శొంఠి రామకృష్ణ మాతృమూర్తి శొంఠి సరస్వతి ఇటీవల మృతి చెందడంతో గురువారం మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దిట్యాల రాంబాబు, వసంతవాడ దుర్గారావు, నాయకలు గోవాడ శివా, షేక్ జానీషరీఫ్, పొలాసి ఉమా, రెడ్డి షణ్ముకం, అర్నేపల్లి పాండు, పాల్గొన్నారు.

అవకతవకలను
ఉపేక్షించం

విశాలాంధ్ర-మచిలీపట్నం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేజ్ స్వీకర్స్ కు సకాలంలో కూలీ చెల్లించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిదేనని కృష్ణాజిల్లా అంబుడ్స్ పర్సన్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు. గురువారం మచిలీపట్టణం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా తనిఖీలో పాల్గొని పథకం అమలు తీరని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలులో వేజ్ సికర్స్ కు ఏమైనా ఇబ్బందులు ఉన్నా, ఏదైనా అవినీతి జరిగితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏ స్థాయిలో అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని అన్నారు. పథకం అమలులో లోపాలు ఉన్నా , వేతన దారులకు నష్టం కలిగిన తన దృష్టికి 78937 55 794 తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేరాలు అరికట్టేందుకు సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : మారుతున్న కాలానికి మారుతున్న నేర ప్రవృత్తికి అనుగుణంగా నేరాలు అరికట్టడంలో పోలీస్ అధికారులు అప్‌డెట్ కావాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు సూచించారు. ముఖ్యంగా పేదలకు సత్వర న్యాయం అందించడంలో పోలీసు అధికారులు సత్వరమే స్పందించాలన్నారు. కృష్ణాజిల్లా అర్థ వార్షిక నేర సమీక్ష సమావేశం జిల్లా ఎస్పీ పి జాషువా అధ్యక్షతన జిల్లా పోలీస్ కార్యాలయం స్పందన మీటింగ్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు విధుల్లో కులమత విచక్షణ లేకుండా నిష్పక్షపాతంగా నిజాయితీగా వ్యవహరిస్తూ మంచి పోలీస్ అధికారిగా గుర్తింపు పొందాలన్నారు. పోలీసు విధులు, కుటుంబంతో తగిన సమయం గడపటం ఈ రెండు బ్యాలెన్స్ చేసుకున్నప్పుడే సరైన నిర్ణయాలు తీసుకుంటారని, తద్వారా పోలీస్ శాఖలో, కుటుంబానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రస్తుతం మండల కేంద్రాల్లో కూడా నిర్వహిస్తున్నామని రాబోయే రోజుల్లో గ్రామస్థాయిల్లో కూడా నిర్వహించాల్సిన పరిస్థితులు రావచ్చని అన్నారు. పోలీస్ అధికారులు నిరంతరం అప్‌డేట్ అవుతూ నేరాలు అరికట్టడంలో కృష్ణాజిల్లాను నెంబర్ వన్‌గా నిలబెట్టగలరని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎస్పి పి.జాషువా మాట్లాడుతూ దైనందిన పోలీసింగ్ లో ప్రాధాన్యతలు గుర్తించి, నేరం జరిగినప్పుడు సత్వర రెస్పాన్స్ వంటి పలు అంశాలు, ఆయా పోలీస్ అధికారుల పెర్ఫార్మెన్స్ వార్షిక, అర్థవార్షిక నేర నివేదికలలో తేటతెల్లమవుతాయని అన్నారు. పోలీస్ అధికారులలో ఆలోచన రేకెత్తించే విధంగా కలెక్టర్ చేసిన సూచనలు అనుసరణీయం అన్నారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి లు శ్రీ హరి బాబు, ఎస్ వి డి ప్రసాదరావు, జిల్లాలో పోలీస్ సబ్ డివిజనల్ అధికారులు, సీఐలు, ఎస్సైలు, దిశా అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల పై గ్రామ సభలు నిర్వహించాలి

జిల్లాలో గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలు, తద్వారా కుటుంబాల్లో ఏర్పడే దుష్పరిణామాల పట్ల తగిన అవగాహన కల్పించుటకు గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ పి రాజాబాబు సూచించారు. కృష్ణాజిల్లా మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పోలీస్ కార్యాలయం స్పందన మీటింగ్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టే చర్యల్లో కృష్ణాజిల్లా ముందు వరుసలో ఉండడం పట్ల కలెక్టర్ పోలీస్ అధికారుల కృషిని అభినందించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు వినియోగించడంతో కలిగే దుష్ఫలితాలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు తగిన అవగాహన కల్పించాలన్నారు. కృష్ణాజిల్లా పోలీస్ అధికారులు మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడంలో కృష్ణాజిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా చేయడంలో సఫలీకృతం కాగలరని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా ఎస్పి పి జాషువా జిల్లాలో గంజాయి మాదకద్రవ్యాలను నియంత్రణ చర్యలు, అక్రమ రవాణా అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు సమావేశంలో వివరించారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి లు శ్రీ హరి బాబు, ఎస్ వి డి ప్రసాదరావు, జిల్లాలో పోలీస్ సబ్ డివిజనల్ అధికారులు, సీఐలు, ఎస్సైలు, ఎస్ ఈ బి అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 204 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 1,03,023 మంది ప్రజలు పాల్గొని వైద్య సేవలు పొందారని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి గత సెప్టెంబర్ నెల 30వ తేదీ నుండి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శిబిరాలను సజావుగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరి ఆరోగ్యం పరిరక్షించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని సంకల్పించిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పేదల ఇంటి గడప వద్దకే కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రతి ఇంటికి వాలంటీర్లు, ఏఎన్ఎంలు వచ్చి కుటుంబంలోని ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి సమీపంలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించే వైద్య ఆరోగ్య శిబిరాలకు వచ్చి వైద్యులకు చూపించుకుని మందులు ఉచితంగా పొందవచ్చనే విషయం తెలియజేయడం జరుగుతుందన్నారు. ఒకవేళ ఏదేని అనివార్య కారణాల వలన ఇంటి వద్ద వైద్య పరీక్షలు చేయించుకోని వారు నేరుగా వైద్య శిబిరానికి వచ్చి కూడా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చాన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 4,21,882 ఇళ్లకు ఏఎన్ఎంలు వెళ్లి ఆరోగ్యపరమైన స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేశారాన్నారు. జిల్లాలో గత సెప్టెంబర్ నెల 30వ తేదీ నుండి ఈనెల 11 వ తేదీ వరకు నిర్వహించిన 204 వైద్య శిబిరాలకు 1,03,023 మంది ప్రజలు హాజరుకాగా అందులో 46,317 మంది పురుషులు, 56,706 మంది మహిళలు ఉన్నారన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ కోరారు.

ప్రపంచ నాటకోత్సవానికి ఏర్పాట్లు

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ నెల 15వ తేదీన కూచిపూడిలో నిర్వహించే నాలుగవ ప్రపంచ కూచిపూడి నాట్యోత్సవం వేడుకలకు రాష్ట్ర సాంస్కృతిక పర్యావరణ శాఖ మంత్రి ఆర్కే రోజా, గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ పాల్గొంటున్న నేపద్యంలో కృష్ణాజిల్లా కలెక్టర్ బి రాజబాబు ఆదేశాలతో జిల్లా స్థాయి అధికారులు గురువారం నాట్యకళాపీఠం ప్రాంగణాన్ని పరిశీలించి మండల స్థాయి పలు సూచనలు ఇచ్చారు. డ్వామా పిడి. సూర్యనారాయణ, డిఆర్డిఏ పిడి ప్రసాద్ మండల స్థాయి అధికారులు పాల్గొని బృందనాట్యం, మహా బృందనాట్యం విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. తహశీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎండిఓ సుధాప్రవీణ్, కలపీఠంఅసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ చింతా రవి బాలక్రిష్ణ, డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు, కూచిపూడి గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శి భవాని లతోపాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. మండల స్థాయి అధికారుల ఆదేశాలతో కార్యదర్శి ఇస్లావత్.భవాని పర్యవేక్షణలో సిబ్బంది బార్లపూడి రోడ్ లో గల రామాలయం ప్రాంతం నుంచి కళా పీఠం రోడ్డు వరకు జెసిబితో మట్టి తొలగించారు. శివాలయం వద్ద వెంపటి చినసత్యం ఇంటి వద్ద,,.ఏ దేవాలయం వద్ద రహదారులకు ఇరువైపులా దట్టంగా పెరిగిన పచ్చి గడ్డి, చెత్తాచెదారాలను పారిశుధ్య కార్మికులతో తొలగించారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం : ఎంపీపీ

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం సాతులూరు గ్రామంలో వైద్యాధికారుల అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి వెలివెల చినబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్య ఆంధ్రపదేశ్ లక్ష్యంగా ఇంటి దగ్గరే బిపి, హెచ్చి, డయాబెటిస్, మలేరియా, వంటి ఆరోగ్య పరీక్షలు చేసి తగిన వైద్యసాయం చేస్తున్నారని అన్నారు. డాక్టరు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్స్ చేయడం, గ్రామాలలో నిపుణులు అయిన వైద్యులు ద్వారా ఉచితంగా వైద్యసహాయం అందజేస్తున్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యధికారి పవన్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజు వచ్చిన గ్రామ ప్రజలకు వైద్య సాయం చేశారు. ల్యాబ్ పరీక్షలు, కంటి పరీక్షలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమాన్ని జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి వైద్యనిపుణులు రంగనాథ్ (ఆర్థోపెడిక్), పిల్లల డాక్టరు, కంటి వైద్య నిపుణులు, సాతులూరు సర్పంచ్ గొల్ల బాలాస్వామి, మాజీ సర్పంచి చోడవరపు రాధాకృష్ణ, వైఎస్సార్ పార్టీ అధ్యక్షులు స్నానం మహేష్, వైఎస్సార్ పార్టీ నాయకులు మలిశెట్టి రాజిబాబు, మల్లేశ్వరం మార్కెట్ యార్డ్ ఎంపిడిఒ జె స్వర్ణభారతి, తహశీల్దార్ ఎం సత్యన్నారాయణ, వైద్యాధికారులు సిహెచ్ సౌందర్య, కె సువర్చల, విజయశ్రీ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం : ఎమ్మెల్యే అనిల్

విశాలాంధ్ర-కూచిపూడి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద వర్గాలకు వరమేనని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలం కోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షా కేంద్రాలను పరిశీలించిననంతరం జరిగిన సభాకార్యక్రమంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా రోగుల పేర్లను ఆన్లైన్లో నమోదు చేస్తున్న సిబ్బంది నుంచి, వైద్య విభాగాల నుంచి, రోగులనుంచి కూడా వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పెనుమూడి రమేష్ ప్రారంభించారు. వైద్య నిపుణులు డాక్టర్ విజయ సాయి కిరణ్, డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి, డాక్టర్ ఎం నాగ విజయశ్రీ, డాక్టర్ బి కిషోర్ వైద్య పరీక్షలను ఈ కార్యక్రమంలోఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, సచివాలయాల కన్వీనర్ (వేములవాడఎంపీటీసీ) సమ్మెట ఆంజనేయులు, కోసూరు ఎంపీటీసీ డొక్కు భూలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోగినేని పెరుమాళ్ళు, ఎండిఓ జి సుధాప్రవీణ్, గ్రేడ్ వన్ కార్యదర్శి ఎంఎన్.ఎస్ మూర్తి, పీహెచ్సీ పరిధిలోని తొమ్మిది సచివాలయాల ఏఎన్ఎంలు, సిహెచ్ఓలు, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందించే పోషకాహారాలను సద్వినియోగం చేసుకోవాలి.

అధిక పోషకాలను అందించే పెరటి కూరలను వినియోగించుకొని రక్తహీనతను తొలగించుకోవాలని ఎమ్మెల్యే కైలేఅనిల్ కుమార్ సూచించారు. మొవ్వ మండలం కోసూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో గురువారం పోషకాహారాల వారోత్సవం సందర్భంగా పంచాయతీ పరిధిలోని 6 అంగన్వాడీ కేంద్రాలు సంయుక్తంగా ఏర్పాటుచేసినిర్వహించిన ప్రదర్శనశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో తయారయ్యే నాణ్యమైనపోష్టకాహారాలు తీసుకొని చంటి పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికలు బలవర్ధకంగా తయారవ్వాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ప్రభుత్వం అందించే వైయస్సార్ సంపూర్ణ పోషణ ఆహారంలో లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖో-ఖో పోటీలకు ఎస్‌పీఎస్ విద్యార్థినులు

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల ఎన్టీఆర్ జిల్లా మైలవరం జరిగిన ఉమ్మడి కృష్ణజిల్లా అండర్ 18 జూనియర్ బాల బాలికల ఖో-ఖోజట్ల ఎంపికలో ఎస్‌పిఎస్ విద్యార్థులు ఎంపిక అవడం అభినందనీయమాని ఖో-ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మడక ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఎస్‌పిఎస్ పాఠశాలలో జిల్లా జట్లుకు ఎంపికైన తిమోతి, అసిఫ్, దుర్గాప్రసాద్, రాకేష్, మహేష్, దిలిఫ్‌లను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మడక ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 20 నుండి 22 వరకు చిత్తూరు జిల్లా యాదమరిలో జరిగే అండర్ 18 జూనియర్ ఖో-ఖో 42వ జూనియర్ ఖో- ఖో రాష్ట్ర స్థాయి పోటీలలో రాష్ట్ర జట్టుకు ఎస్‌పిఎస్ విద్యార్థలు ఎంపిక్వడం గొప్పవిషయమన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ డివిజన్ ఉపవిద్యశాఖ అధికారిణి ఐ.పద్మారాణి, పాఠశాల విద్యకమిటీ చైర్మన్ గుడివాడ సుమిత్రకుమార్, పాఠశాల ప్రధానఉపాధ్యారాలు రాణి, పాఠశాల సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

పాఠశాలకు వంట సామాగ్రి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలంలో 33 ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలు ఎంఈఓ కార్యాలయంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాయక్, హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'లో గందరగోళం

విశాలాంధ్ర-అవనిగడ్డ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గందరగోళంగా జరిగింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని మోదుమూడి సచివాలయ పరిధిలో ఎం.పి.డి.ఓ మరియాదేవి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామస్థుడు జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు వెంకట నారాయణ పార్టీ పథకమా ? ప్రభుత్వ పథకమా ? పార్టీ పథకం లాగా పార్టీ నేతలే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇది ప్రభుత్వ పథకం కాదా అని నిలదీశారు. దింతో గందరగోళం పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గోన్న ఎం.పి.పి తుంగల సుమతీదేవి జగనన్న ఆరోగ్య కిట్‌లను పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహిస్తున్నట్లు ఎం.పి.పి తుంగల సుమతీదేవి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఊరూర నిర్వహిస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. ఎంతో ఖరీదైన విద్య, వైద్యాన్ని పేదలకు అందుబాటులోనికి తెచ్చిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా బి.పి , షుగర్ లతో పాటు 11 రకాల వైద్య పరీక్షలను నిర్వహించగా ఇరువురు ప్రత్యేక డాక్టర్లతో పాటు మొత్తం 6 గురు వైద్య సిబ్బంది సురక్ష కార్యక్రమంలో పాల్గొని 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మీ, జడ్.పి.టి.సి చింతలపూడీ లక్ష్మీనారాయణ, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, తహశీల్దార్ ఎల్ శివరామకృష్ణ, ఇ.ఓ.పి.ఆర్.డి పి శైలజాకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన

విశాలాంధ్ర-కృత్తివెన్ను : గ్రామీణ ప్రాంత ప్రజలు ఆర్థిక అక్షరాస్యతను పాటిస్తే కుటుంబ ఆర్థిక వ్యవస్థలో మంచి ఫలితాలు వస్తాయని బ్యాంక్ అధికారులు ప్రజలకు వివరించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును పల్లిపాలెం గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రకథ కళారూపం ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంక్ అధికారులు డ్వాక్రా మహిళల నుండి స్వీయ అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ డివిజనల్ మేనేజర్ కె రాంప్రసాద్, మచిలీపట్నం మేనేజర్ ప్రకాశ రత్నం, లక్ష్మీపురం బ్రాంచ్ మేనేజర్ యు వి ఎస్ ఎస్ శాస్త్రి ఇతర బ్యాంకు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

శుద్ధమైన తాగునీటిని అందించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : మంచినీటి చెరువు చుట్టూ ఫినిషింగ్ వేసి గ్రామ ప్రజలకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాజనాల వీరబాబు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామం నడిఒడ్డున ఉన్నటువంటి మంచినీటి చెరువుల మరమత్తులు ఫిల్టర్ బెడ్ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం నిమిత్తం కోటి ముప్పైఏడు లక్షల వ్యయంతో 2005-06 మధ్య కాలంలో ఆ నాటి రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా 2006 డిసెంబర్ 22 న ఘనంగా ప్రారంభోత్సవం నిర్వహించారన్నారు. అయితే నిర్మాణం జరిగి 15 సంవత్సరాలు దాటుతున్న నేటికి ఒక్క సంవత్సరం కూడా నీటి సరఫరా చేయలేకపోయారని బోర్లపై ఆధారపడి మంచినీటిని గ్రామస్థులకు అందిస్తున్నారే తప్ప నాణ్యతతో కూడినటువంటి ఫిల్టర్ మంచినీటిని అందించలేకపోతున్నారని కోటి ముప్పైఏడు లక్షల రూపాయలు వృధా అయితే ఆ తప్పు ఎవరిది అని అధికారులు భాధ్యత వహిస్తారా అని అధికారులపై నాయకులు దృష్టి కొరవడిందా అని ప్రశ్నించారు. ప్రాణాలు కూడా కోల్పోయారని ఈ ప్రాణాలను భాద్యత ఎవరిది అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామసభల్లో ఈ విషయం అధికారులు పాలకుల దృష్టికి తీసుకువెళ్తే త్వరలో చెరువు చుట్టూ కంచె నిర్మాణం చెపడతామని దాటవేత దోరణిలో పాలకపక్షం అధికారులు వివరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామ ప్రజలపై దృష్టి పెట్టి మంచి నీటి ఫిల్టర్ బెడ్ వ్యవస్థపై చర్యలు తీసుకోకపోతే త్వరలో జనసేన పార్టీ తరుపున ప్రజా ఉద్యమం చెపడతామని రాజనాల వీరబాబు హెచ్చరించారు.

మౌలిక సదుపాయాల పనులు వేగవంతం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని అలాగే భద్రత విషయంలో ఎక్కడా రాజీపడవద్దు అని అధికారులను డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్ అదేశించారు. గురువారం నరసాపూర్-గుడివాడ బ్రాంచ్ లైన్ సెక్షన్‌ను తనిఖీలు నిర్వహించారు. ముందుగా నర్సాపూర్‌లోని రన్నింగ్‌రూమ్, ఐఓహెచ్ షెడ్, పిట్‌లైన్, సీఅండ్‌డబ్ల్యూ డిపోలను డీఆర్ఎం పరిశీలించారు.కోచింగ్ పిట్ లైన్స్ దగ్గర ఎమ్&పి (మెషిన్ & ప్లాంట్స్) అనుబంధ షెడ్‌ను ప్రారంభించి, సిబ్బందికి అంకితం చేశారు.హరిత పర్యావరణం వైపు రన్నింగ్ రూమ్ వద్ద ప్లాంటేషన్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఇటీవల ప్రారంభించిన అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో నర్సాపూర్ స్టేషన్ అభివృద్ధి పనులపై చర్చించి పాలకొల్లు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ అన్ని ప్లాట్‌ఫారమ్‌లు, ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించి, భద్రతా అంశాలు, ఆపరేషన్‌ల విధానాన్ని సమీక్షించారు. ప్యానెల్ గదిని కూడా తనిఖీ చేశారు. భీమవరం టౌన్, భీమవరం జంక్షన్ స్టేషన్లను తనిఖీ చేశారు. జంక్షన్ స్టేషన్ వద్ద, హెల్త్ యూనిట్, బుకింగ్ ఆఫీస్, సర్క్యులేటింగ్ ఏరియా.ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను తనిఖీ చేశారు. భీమవరం టౌన్ స్టేషన్ వద్ద వెస్ట్ సర్క్యులేటింగ్ ఏరియాను,ఈస్ట్ సైడ్ న్యూ ఎంట్రీని పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ల పరిధిలోని భీమవరం పట్టణంలో స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ డెవలప్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ సౌకర్యం,ఇతర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైలు కార్యకలాపాలలో సమయపాలన- భద్రతపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆకివీడు, గుడివాడ రైల్వేస్టేషన్‌లలో ప్రయాణికుల సౌకర్యాలు, పరిశుభ్రత, సర్క్యులేటింగ్ ప్రాంతాలను పరిశీలించి విజయవాడ వరకు వెనుక కిటికీలను పరిశీలించారు. డిఆర్ఎంతో సీనియర్ డీసీఎం వి.రాంబాబు, సీనియర్ డిఒఎమ్ డి.నరేంద్ర వర్మ,సీనియర్ డిఈఈ(టీఆర్ఎస్ఒ) కె. శ్రీనివాసరావు, సీనియర్ డిఈఈ(నిర్వహణ)టి. సురేష్,డిఈఎన్(తూర్పు) కె. శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్య రక్షణే జగన్న సురక్ష : ఎంపీపీ అనగాని

విశాలాంధ్ర-గన్నవరం : పేదలకు ఆరోగ్యశ్రీ కంటే ఎక్కువ వ్యాధుల చికిత్స అందేలా సియం జగన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని యంపీపీ అనగాని రవి అన్నారు. గురువారం మండలంలోని విరపనేనిగూడెం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షను సర్పంచి అరెపల్లి జెజెమ్మ, ఎంపీపీ అనగాని రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా అనగాని రవి మాట్లాడుతూ గెస్మిన ప్రాంతంలో పేద ప్రజలకు వైద్యం అందాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగన్న ఆరోగ్య సురక్ష అమలు చేస్తున్నరని అన్నారు. ఈ కార్యక్రమలో యంపీపీ అనగాని రవి, సర్పంచి అరెపల్లి జెజెమ్మ, ఎంపీటీసీలు నండిపాటి పద్మావతి, ఉప సర్పంచి బండి నాగ సాంబిరెడ్డి, మాజీ సర్పంచి బొమ్మారెడ్డి రోసిరెడ్డి, కో ఆపరేట్ బాంక్ అధ్యక్షులు బొమ్మారెడ్డి శ్రీనివాస రెడ్డి, బీమావరపు సంబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేవదానం కుటుంబానికి కుమార్ రాజా పరామర్శ

విశాలాంధ్ర-పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా మండలంలోని అప్పికట్ల గ్రామంలో శాయల వెంకటనారాయణ, చినపారుపూడి గ్రామంలో కంచర్ల అబ్రహం, ఈదుల మద్దాల గ్రామంలో గంటా దేవదానం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వర్ల ఆయా కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, నాయకులు కొల్లి రామచంద్ర రావు, దానబోయిన వెంకటనారాయణ, గోగం రామారావు, కనుమూరు ఈశ్వరరావు, నాగనబోయిన గాంధీ, శాయల వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ దృష్టి దినోత్సవం



విశాలాంధ్ర-కూచిపూడి : ''సర్వేంద్రియాణాం నయనం ప్రధానం''అంటూ కంటి పరీక్షలు నిర్వహిస్తూ సేవ చేస్తున్న ఆప్తాలజిస్ట్ డి కిషోర్ (చల్లపల్లి) ను పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ సత్కరించారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం కూచిపూడి రోటరీ క్లబ్ కోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్లోనిర్వహించిన ఈ వేడుకలలో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్.పాల్గొన్నారు. ఈ సందర్భంగా దృష్టి కోసంచేస్తున్న అతను చేస్తున్నసేవలను కొనియాడుతూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు కే రామాంజనేయులు, సభ్యులు పాగోలు రమేష్, జొన్నలగడ్డ హనుమకుమార్, ఎంపీపీ కొండేటి ఇందిర, ఎండీవో జి సుధాప్రవీణ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోగినేని లక్ష్మి పెరుమాళ్ళు, సర్పంచి పెనుమూడి రమేష్, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెటఆంజనేయులుతదితరులు పాల్గొన్నారు.

జ్యోతి సురేఖను ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : దేశ కీర్తిని నలుదిశలా వ్యాపింప చేసిన ప్రముఖ క్రీడాకారిణి జ్యోతి సురేఖను నేటి క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. చైనాలోని హాంగ్‌జాలో ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో భారత్ తరుపున ప్రాతినిధ్యం వహించిన జ్యోతి సురేఖ అర్చరీ విభాగంలో పథకాలు సాధించిన సురేఖ స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గురువారం కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్చరీ విభాగంలో 3 స్వర్ణ పథకాలు సాధించటంతో పాటు పలు రికార్డులను తిరగరాస్తూ సరికొత్త చరిత్ర సృష్టించి ఆసియా క్రీడల్లో భారత్ త్రివర్ణ కీర్తిని సువర్ణాక్షరాలతో లిఖించేలా చేయటం అభినందనీయమని కొనియాడారు. ఆమె ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ క్రీడల్లో కూడా పథకాలు సాధించడం గర్వకారణమని కలెక్టర్ ఢిల్లీరావు ఆమెను అభినందించాడు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి : సీపీఐ

విశాలాంధ్ర-గంపలగూడెం : నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం పెరగకపోగా దివాలా తీసే పరిస్థితి వచ్చిందని సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్. నాగుల్‌మీరా అన్నారు. స్థానిక గాంధీ సెంటర్ సమీపంలో గురువారం పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేశారని విమర్శించారు. సీపీఐ మండల కార్యదర్శి ఉన్నం సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురాలేక పోగా ఉన్న కంపెనీలను కక్షపూరితంగా ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాలా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మండల సహాయ కార్యదర్శి గౌర్రాజు రామకృష్ణ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి మర్చిపోయారని, విభజన హామీలను పట్టించుకోకుండా సొంత ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం దగ్గర సాగులపడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు గ్రామ శాఖ కార్యదర్శి సిద్ది కొండలరావు, పట్టాను యూసుఫ్, మేడూరుశాఖ కార్యదర్శి కూరపాటి చిట్టిబాబు, కే రామారావు, ఎస్‌కే బాబు, సత్యనారాయణ, బట్టగాని పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను విపరీతంగా దోచుకుంటున్నారు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రాష్ట్ర ప్రభుత్వం సర్ ఛార్జీలు, వినియోగఛార్జీలు, ట్రూఅప్ చార్జీల పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలను విపరీతంగా దోచుకుంటోందని సీపీఐ మండల కార్యదర్శి మర్సకట్ల త్యాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇష్టానుసారం పెంచుతున్న విద్యుత్‌ఛార్జీలను అదుపు చేయాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం విస్సన్నపేటలో జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. బాదుడే బాదుడు అంటూ వ్యంగ్యంగా ఆరోపణలు చేస్తూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ నేడు అదే బాదుడుతో పేద, చిన్నవర్గాలపై వేధింపులకు పాల్పడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మోతే శోభనాచలం, పతకమూడి నాగేశ్వరరావు, మేడా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఈ నెల 15వ తేది నుండి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాల్లో యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.పి.సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవ ఏర్పాట్లుపై స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జేసీ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కూడా లక్షలాధి మంది యాత్రికులు తరలిరానున్నారన్నారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. గతేడాది నిర్వహించిన దసరా ఉత్సవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద, భవానిపురం వైపు నుండి వచ్చే యాత్రికులకు కుమ్మరిపాలెం సెంటర్ నుండి కొండపైకి ఏర్పాటు చేసిన క్యూ లైన్లలో యాత్రికులకు నిరంతరం త్రాగునీరు సరఫరా చేయాలని మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు 30 లక్షల వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేయాలని సుచించారు. క్యూలైన్సులో వేచి ఉండే యాత్రికులకు, చిన్నారులకు బిస్కెట్లు, పాలు అందించేలా స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. గంట నుండి గంటన్నరలోపు అమ్మవారి దర్శనం పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకుంటే రద్దీని నివారించేందుకు అవకాశం ఉటుందన్నారు. లడ్డు ప్రసాదం కౌంటర్లు వద్ద తగినంత సిబ్బందిని నియమించాలని, భక్తులు పుణ్య స్నానాలను అంచరించేందుకు సీతమ్మవారి పాదాలు, దోభి ఘాట్, పున్నమి ఘాట్, భవానీ ఘాట్, దుర్గా ఘాట్‌లలో ఏర్పాటు చేసిన జల్లు స్నానాలు వద్ద తగినంత మంది పరిశుద్ధ్య కార్మికులను నియమించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కొండపైన, దిగువున, ఘాట్ల వద్ద వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 15 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి అత్యవసర చికిత్స, పరికరాలను, మందులను సిద్దంగా ఉంచాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ వెంకశ్వర్లు, డ్వామా పీడీ సునీత, డీఎస్‌వో మోహన్‌బాబు, మార్క్‌ఫెడ్ డీఎం నాగమల్లిక, ఎల్‌డీఎం కే.ప్రియాంక, దేవస్థానం ఈవో రమ, తహశీల్దార్లు మాధురి, కాళీలక్ష్మి, జాహ్నవి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు పట్టుకున్న రెడ్డిగూడెం ఎస్సై ఎస్ శ్రీను గురువారం తెల్లవారుజామున కొత్తరెడ్డిగూడెం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఏపీ 39యుఏ 2094 వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 9క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని రెడ్డిగూడెం ఎస్సై తన సిబ్బందితో కలసి పట్టుకున్నారు. ముసునూరు మండలం గొళ్ళమూడి గ్రామానికి చెందిన లాగు బాలమురళీ ఎలియాస్ బాలు, నాగులూరు పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి వాటిని గుట్టు చప్పుడు కాకుండా విస్సన్నపేట ఏరియాలోని కోళ్ళఫారాలకు అమ్ముకునేందుకు అక్రమంగా తరలిస్తుండగా వాహనాన్ని, రేషన్ బియ్యాన్ని, బాలమురళీని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిని తహసిల్దార్‌కు రిఫర్ చేసినట్లు ఆయన తెలిపారు.

దోనెపూడి శంకర్‌కు ప్రజానాట్యమండలి అభినందనలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): సీపీఐ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన దోనేపూడి శంకర్‌కు ప్రజానాట్యమండలి గాయకులు అభినందనలు తెలిపారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో నగర మహిళా సమాఖ్య మహాసభ సందర్భంగా వచ్చిన శంకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం శాలువాతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి ప్రజానాట్యమండలి ఇన్‌ఛార్జి లంక దుర్గారావు, నగర గౌరవాధ్యక్షుడు, సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు కె.వి భాస్కరరావు, నగర అధ్యక్షులు ఎస్‌కే నజీర్, కార్యదర్శి డి సూరిబాబు, జాతీయ సమితి సభ్యులు రెడపంగు పిచ్చయ్య, నగర సభ్యులు కాళ్ల చెన్నప్ప, ఎస్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యం : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-వీరులపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష - ప్రజలందరికీ ఆరోగ్య రక్ష, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం అని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ అన్నారు. వీరులపాడు మండలం కొణతాలపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనారోగ్య బాధితులందరికీ అత్యుత్తమ వైద్యం అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, తహశీల్దార్ ఆశయ్య, నర్సిరెడ్డి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు
ఫీజుల్లో 50 శాతం రాయితీ
సర్క్యులర్ జారీచేసిన జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థల్లో ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సర్క్యులర్ జారీ చేశారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేట్ మేనేజ్‌మెంట్‌లో జర్నలిస్టుల విద్యార్థుల ఫీజుల విషయంలో ఈ సర్క్యులరును అమలు అయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టు పిల్లల ఫీజుల రాయితీ అంశంపై ఏపీయూడబ్ల్యూజే, విజయవాడ ప్రెస్‌క్లబ్ నాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ తక్షణమే సర్క్యులర్ జారీ చేశారు. ప్రైవేట్ మేనేజ్మెంట్లలో జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో 50 శాతం రాయితీ అమలు అయ్యేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అన్ని ప్రైవేటు మేనేజ్మెంట్లకు సర్క్యులర్ అందజేయటం, అమలు అయ్యేలా చేయాలని విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరుకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవి సుబ్బారావు, చందు జనార్థన్, విజయవాడ ఏపీయూడబ్ల్యూజే యూనిట్ అధ్యక్షులు చావారవి, కార్యదర్శి వసంత్, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్, కార్యదర్శి దాసరి నాగరాజు ఇతర జర్నలిస్టులు కలెక్టరుకు ధన్యవాదాలు తెలిపారు.

విజిలెన్స్ కమిటీ అధ్యక్షురాలిగా వనజాక్షి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులు, వాటి నివారణకు సంబంధించి విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలిగా విస్సన్నపేట ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. తిరువూరు డివిజన్ స్థాయిలో ఈ కమిటీకి తిరువూరు ఆర్డీవో ప్రసన్నలక్ష్మి అధ్యక్షులిగా పనిచేస్తారు. ఈ కమిటీలో తిరువూరు, మైలవరం ఎమ్మెల్యేలు కె.రక్షణనిధి, వసంత కృష్ణప్రసాద్‌లతో పాటు, కె.దాసు (గంపలగూడెం), కె.దుర్గాప్రసాద్ (ఎ.కొండూరు), కె.రవికుమార్(తిరువూరు), వి.నాగేంద్ర రావు(విస్సన్నపేట), మైలవరం డివిజన్ ఏసీపీ స్థాయి అధికారి, డివిజన్ కేంద్రం తిరువూరుకు చెందిన మండలపరిషత్, రెవిన్యూ మండలస్థాయి అధికారులు ఈ కమిటీలో పనిచేయనున్నారు. తన నియామకానికి కృషి చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఈ సందర్భంగా ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి కృతజ్ఞతలు తెలియజేయటంతోపాటు, స్థానిక ఎమ్మెల్యే రక్షణనిధిని ఘనంగా సన్మానించారు.

24 గంటలూ పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : దసరా ఉత్సవాల సందర్భంగా నగరానికి వచ్చే లక్షలాది మంది యాత్రికులకు ఎలాంటి పారిశుధ్య ఇబ్బంది కలుగకుండా 24 గంటలు పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబందిత అధికారులను ఆదేశించారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో దసరా ఉత్సవాల్లో పారిశుధ్య నిర్వహణపై కమిషనర్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాలకు పారిశుధ్య కార్మికులకు 3 షిఫ్టుల్లో 24 గంటలు అందుబాటులో ఉండాలని, మరుగుదొడ్లు, ఆలయ పరిసర ప్రాంతాలు, రోడ్లు, క్యూ లైన్‌లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సిబ్బందికి సకాలంలో భోజన ప్యాకెట్‌లు అందించాలని, తాగునీటి పాయింట్‌లను ఏర్పాటు చేసి నిరంతరం యాత్రికులకు, ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. విధి నిర్వహణలో నిబందనలు పాటించేలా చూడాలని, నగరంలో సీతమ్మవారి పాదాలు, శనీశ్వరస్వామి ఆలయం, భవానిపురం పున్నమిఘాట్, స్నానఘాట్లు, కెనాల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో యాత్రికులకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా పోలీస్ సిబ్బందితో సమన్వయం చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్‌లు కేవీ.సత్యవతి, శకుంతల, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.పీ.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి, సిటీ ప్లానర్ ప్రసాద్, జోనల్ కమిషనర్-1 రవిచంద్, ఎస్‌ఇ నరసింహమూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏడీహెచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.

ఎన్ని సమస్యలున్నా సత్వర పరిష్కారం అందిస్తాం : మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలో ఎన్ని సమస్యలున్నా సత్వర పరిష్కారాన్ని అందిస్తామని నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి తెలిపారు. 2వ డివిజన్ దేవినేనినగర్ వద్ద రూ.38 లక్షలతో నూతనంగా నిర్మించనున్న మెట్ల మార్గానికి మేయర్‌తో కలిసి అవినాష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణాలు, పల్లెలు, కాలనీలు, కొండప్రాంతాలు అనే తేడా లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. నగరంలోని తూర్పు నియోజకవర్గంలో అధిక భాగం ఉన్న కొండప్రాంత అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గంలో అవినాష్ కొండ చిట్టచివరి ప్రాంతం వరకు ప్రయాణించి అక్కడున్న ప్రజల కష్టాలు తెలుసుకొని ప్రభుత్వానికి తెలపటంతో స్పందించిన ప్రభుత్వం కార్పొరేషన్ సహకారంతో మెట్లుకు శంకుస్థాపన జరుగుతుందన్నారు. అవినాష్ మాట్లాడుతూ ఒక వార్తా పత్రికలో వచ్చిన న్యూస్ చూసి అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్య సేవలకు కేవలం గంటల వ్యవధిలోనే రూ.7 లక్షలు సీఎం సహాయనిధి ద్వారా అందిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్థానిక కార్పొరేటర్ నిర్మలాకుమారి పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాల సద్వినియోగంలో...
సమాచార శాఖ సేవలు అనివార్యం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సంక్షేమ ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడంలో సమాచార శాఖ సేవలు అనివార్యమని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టీ.విజయకుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక స్టేట్‌గెస్ట్ హౌస్ ఆవరణలోని జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయం, అడ్మినిస్ట్రేటివ్, మీడియా హాల్‌ను గురువారం సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్, జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, జేసీ డా.పీ.సంపత్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద, బలహీన వర్గాలకు ఆర్థిక ప్రయోజనం కల్పించేలా సుమారు 35కుపైగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంద న్నారు. ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవటానికి విస్తృతమైన ప్రచారం అవస రమన్నారు. పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరువ చేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖ సేవలు అనివార్యమని, అర్హతున్న ప్రతి లబ్దిదారునికి సంక్షేమ ఫలాలను చేరువ చేస్తున్నామన్నారు. అర్హతుండి లబ్ది చేరకపోతే పునఃపరిశీలించి ప్రభుత్వ లబ్ది చేకూర్చేలా చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలోను లేని విధంగా ఎన్‌టీఆర్ జిల్లాలో సమాచార శాఖకు మౌలిక సదుపాయాలు, వనరులను సమకూర్చడంలో కలెక్టర్ ఎస్.డిల్లీరావు అందిస్తున్న సహకారం మరువలేమన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. మీడియా ప్రతినిధుల పిల్లలు విద్యా బోధనకు చెల్లించే రుసుంలో 50 శాతం ఫిజు రాయితీని కల్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమన్నారు. సమాచార శాఖ అడ్మినిస్ట్రేటివ్, మీడియా హాల్‌ను ఆధునీకంగా తీర్చి దిద్దడాన్ని అభినందించారు. నూతన భవనం ద్వారా రానున్న ఎన్నిక లకు పూర్తి సమాచారాన్ని మీడియా ద్వారా ప్రజలకు చేరవేడంలో సహకరిస్తుందని, జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్యమైన భాగమని, ప్రముఖులు, ప్రజా ప్రతినిధుల ప్రర్యటనల సమాచారం, వార్తలు, ఫోటోలను అందించటం మీడియా ప్రతినిధులకు అవసరమైన సహకారం అందించడంలో సమాచార శాఖ అధికారులు సిబ్బంది అలుపెరుగని సేవలందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ జేడీ కిరణ్‌కుమార్, కస్తూరిబాయి, డీఐపీఆర్‌వో యు.సురేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్‌వీ.మోహన్‌రావు, డ్వామా పీడీ సునీత, డీపీవో జయచంద్రగాంధీ, జిల్లా సాంఘిక సంక్షేమ విద్యాలయాల సంస్థ అధికారి సుమిత్రాదేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ సుమన్, సమాచార శాఖ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

బస్సు షెల్టర్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర-నందిగామ: నందిగామ మండలంలోని కేతవీరుని పాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బస్ షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ సుజనా చౌదరి ఎంపీ ల్యాడ్స్ నిధులతో బస్ షెల్టర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు ప్రజల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మాణానికి నిధులు కేటాయించడం మంచి పరిణామమన్నారు. వైద్యులు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్యారోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పురంధేశ్వరి బీజేపీలో ఉన్నారా?
టీడీపీలో ఉన్నారా?
ఎంపీ విజయసాయి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పురంధేశ్వరి బీజేపీలో ఉన్నారా?, టీడీపీలో ఉన్నారా? అని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి సూటిగా ప్రశ్నించారు. గురువారం ఆయన సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతూ, చంద్రబాబు నేరం చేసి అడ్డంగా దిరికిపోయినప్పటికీ, అతనికి చట్టం వర్తింపజేయొద్దంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఢిల్లీలో ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అవినీతికి పాల్పడ్డాడని, 13 సార్లు సంతకం కూడా పెట్టాడని వివరించారు. అయినప్పటికీ ఆయనకు చట్టం వర్తింపజేయవద్దంటూ పోరాటం చేయడం ఎంతవరకు సమంజసమని పురందేశ్వరిని నిలదీశారు. ఫేక్ అగ్రిమెంట్ తో స్కిల్ స్కాం చేశారని కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థ ఈడీ కూడా నిర్ధారించి అరెస్టులు చేసిందని, మరోవైపు ఆ అగ్రిమెంట్ ఫేక్ అని సీమెన్స్ కంపెనీ ధృవీకరించిందని, ఆ అగ్రిమెంట్ తో తమకు ఎలాంటి సంబంధమూ లేదని అలాగే ఆ డబ్బు కూడా తమకు అందలేదని కంపెనీ 164 స్టేట్ మెంట్ లో తేల్చిచెప్పిందని తెలిపారు. జాతీయ పార్టీ బీజేపీని 'బావ' (చంద్రబాబు) సారూప్య పార్టీగా మార్చిన ఘనత పురందేశ్వరికే దక్కుతుందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ లో ఉన్నానని, ఇప్పుడు బీజేపీలో ఉన్నానని చెబుతున్నా ఆమె టాప్ ప్రయారిటీ మాత్రం అవినీతి మరిది చంద్రబాబుకు శిక్ష పడకుండా కాపాడుకోవడమేనని నిరూపిస్తున్నారని విజయసాయిరెడ్డి అన్నారు.

యువతి ఆత్మహత్య !

విశాలాంధ్ర-వీరులపాడు: తల్లి మందలించడం తో మనస్థాపానికి గురై యువతి ఆత్మహత్య కు ప్రయత్నించి మరణించిన ఘటన వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పెద్దాపురం గ్రామానికి చెందిన కుంభ లక్ష్మీ శిరీష అనే యువతి తల్లి మందలించడం తో మనస్తాపానికి గురై ఈ నెల 5 న శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న ఆమెకు మొదటి సంవత్సరం లో కొన్ని సబ్జెక్ట్ ఫెయిల్ అవ్వడం, తరచూ చరవాణి చూస్తుండడం తో తల్లి మందలించడం తో ఆత్మహత్యకు పాల్పడింది.మొదట కంచికచర్ల లో చికిత్స పొందిన అనంతరం నోట్లో పొక్కులు రావడంతో ఈ నెల 9 న నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స తరువాత మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ కు తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 10 న మరణించింది. తల్లి త్రివేణి ఫిర్యాదు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహాలక్ష్ముడు తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు : సామినేని

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలు -2 సచివాలయం పరిధిలోని ఎస్సీ కాలనీ,తూర్పు బజార్‌లో సామినేని ఉదయభాను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న నవరత్నాల పథకాలు పేదల జీవితాల్లో నూతన కాంతులను నింపుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి, ఎంపీపీ మార్కపుడి గాంధీ,జేడ్పిటిసి పూట్ల నాగమణి,మైనింగ్ పూసల కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు,చేని కుమారి,గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్,మండల పార్టీ అధ్యక్షుడు కనకపూడి భాస్కర్ రావు,మాజీ మండల పార్టీ అధ్యక్షులు పూట్ల నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరరావు ,మండల సచివాలయాల కన్వీనర్ కన్నమల శామ్యూల్,వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు,మండల సమైక్య అధ్యక్షురాలు కాకాని పద్మ,మాజీ అధ్యక్షురాలు బొమ్మి రాణి,సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు,సోషల్ మీడియా కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I,GAJJARAPU SARADA (Old Name), W/o Subba Rao Resident of D.No.11-1-58, BRP Road, Vijayawada - 520001, NTR District, Andhra Pradesh. I have changed my name as **GAJJARAPU VISARADA (New Name)**, W/o Subba rao. Hereafter, my name is known as **GAJJARAPU VISARADA (New Name)**, W/o Subba Rao.

CHANGE OF NAME

I, MOHAMMAD RAFI AHAMED (old name) holding passport no L4712766 issued at Hyderabad on 11/09/2013 hereby announce to change my name as **MOHAMMED RAFI AHAMMAD** (new name) for all future purposes.

CHANGE OF NAME

I, SRI DIVYA K. (Old name), **D/o. KOTA VENKATA CHALAPATHI RAO,** aged 31 years, R/o. D.No.14-20-26, Main Road, Gandhi Nagar, Vijayawada, NTR Dist, AP. have changed my name to **KOTA CHANDRIKA NAGA SRI DIVYA** (New name) Henceforth, I will be Called & Known as **KOTA CHANDRIKA NAGA SRI DIVYA**

CHANGE OF NAME

I, **Rekandhar Sandhya (Old Name),** W/o Divi Nageswara Rao, residing at D.No. 5-10, Indira Nagar-1, Pappulamill Center, Yanamalakuduru, Vijayawada -520007, Krishna District, AP., India. I have changed my name to **DIVI LAVANYA (New Name).** Hence forth I will be known as **DIVI LAVANYA**

IN THE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. No.1367/2022

Between:
Arun Bollavarapu .... Plaintiff
AND
Amsari Satish Kuma ... Defendant
To,
Amsari Satish Kumar, S/o. Koteswara Rao, R/o. D.No. A- Block, KKFF3, VambayColony, Vijayawada.

పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన మీకు మీ హాజరు నిమిత్తము శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకోనక కాలయాపన చేయుచున్నందున ఈ నోటీసు ద్వారా మీరు ది.10-11-2023న ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకోవలెను. లేనియెడల దావా మీ పరోక్షమున తీర్మానింపబడును.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///

Chittibabu Kuntam
Kakaraparthi Naga Sridhar
Advocate for Plaintiffs,
Vijayawada.

మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ 2 కె వాక్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని మ్యాక్సీవిజన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో 2 కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరుణ ఐ బ్యాంక్ ఫౌండర్ చైర్మన్ దారా కరుణశ్రీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్టోబర్ నెలలో రెండవ గురువారాన్ని మనం ప్రపంచ దృష్టి దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. దృష్టి సంబంధమైన సమస్యలు, వాటిని శాశ్వతంగా నివారించేందుకు 1981 వ సంవత్సరంలో లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. దృష్టికి సంబంధించిన సమస్యలను అధిగమించేందుకు ఈ కార్యక్రమాన్ని నగరం మ్యాక్సీవిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మ్యాక్సీవిజన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ ఎ రామకృష్ణలు మాట్లాడుతూ ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పరచుకుని పురస్కరించుకుని లవ్ యువర్ ఐస్ అట్ వర్క్ అనే తీఎం తో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈరోజుల్లో కంటి సమస్యలు అనేవి సర్వ సాధారణంగా అయిపోయాయని విద్యార్థులు, ఉద్యోగులు అధికంగా ఈ సమస్యల బారిన పడుకున్నారని, కంప్యూటర్ ఎక్కువగా వినియోగించేవారు, సాఫ్ట్వేర్ రంగంలో ఉన్నవారు అధిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అలాంటివారు వారి సమస్యలను గుర్తించి, ఐ చెకప్స్ ప్రతి ఆరు నెలలకు ఒకసారి చేయించుకోవడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సంస్థ జీఎం ప్రదీప్ కుమార్ , ఏజీఎం రవిబాబు, ఆపరేషన్ మేనేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ క్లస్టర్ మేనేజర్ కోటేశ్వరరావు, మార్కెటింగ్ మేనేజర్ భీమయ్య మరియు టీం, అలాగే హాస్పిటల్ సిబ్బంది, విజయ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అమ్మ జ్ఞాపకం మరువలేనిది

కళ్ళే ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి, కళ్ళే జయదుర్గ

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): కని పెంచిన అమ్మ జ్ఞాపకం మరువలేనిదని స్వర్గీయ కళ్ళే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి,కళ్ళే జయదుర్గలు అన్నారు. కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదీన క్రమంతప్పకుండా పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం జరుపుతున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు, సభ్యులు స్వర్గీయ కళ్ళే లలిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎమ్.జశ్వన్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి నిత్యాన్నదానానికి కూరగాయలు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : తిరుమల శ్రీవారి నిత్యాన్నదానానికి వెళుతున్న కూరగాయలను తన చేతుల మీదుగా ప్రారంభించడం చాలా అదృష్టంగా భావిస్తున్ననని దేవినేని అవినాష్ అన్నారు. మొగల్రాజపురానికి చెందిన గద్దె శ్రీనివాసరావు, గిరిబాల, గద్దె శేషుబాబు, వసుధ ల సహకారంతో తిరుమల అన్నాదానానికి వెళుతున్న 10 టన్నుల కూరగాయల లారీని దేవినేని అవినాష్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూలా నిత్యం. లక్షలాది మంది వెళ్ళే తిరుమల అన్నదాన పథకానికి నగరవాసులు కూడా పాలుపం చుకోవడం వారి అదృష్టమని అన్నారు. అనంతరం దాతలు మాట్లాడుతూ శ్రీవారి సేవలో పాల్గొనే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. బి.ఎ. నాగు మాట్లాడుతూ నగరంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మండవ కుటుంబరావు తమ మధ్య లేకపోవడం బాధకరమని ఆయిన ఆయన అశ్వీసులతో ఈ కార్యక్రవన్ని కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏ బిలియన్ ఫిల్మ్స్ ఫర్ ఏ బిలియన్ ఫ్యాన్స్‌ను ఆవిష్కరించిన సీగ్రమ్ రాయల్ స్టాగ్

విశాలాంధ్ర విజయవాడ (వన్ టౌన్) : ప్రపంచ స్థాయిలో క్రికెట్‌తో తమ దీర్ఘకాల అనుబంధాన్ని బలోపేతం చేసుకుంటూ, సీగ్రమ్ రాయల్ స్టాగ్ ఒక వినూత్నమైన, లీనమయ్యే ఎఐ ఆధారిత అభిమానుల అనుభవాన్ని 'ఏ బిలియన్ ఫిల్మ్స్ ఫర్ ఏ బిలియన్ ఫ్యాన్స్ ను విడుదల చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటన తెలిపారు. భారతదేశం యొక్క అత్యంత ప్రతిభావంతులైన క్రికెటర్లలో ముగ్గురు, జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, జస్ప్రీత్ బుమ్రా, సూర్య కుమార్ యాదవ్ ఈ చిత్రంలో కనిపించనున్నారనీ తెలిపారు. క్రికెట్‌తో ముడిపడివున్న, జీవితానికంటే మిన్న అయిన భావోద్వేగాలను మరింతగా పెంపొందిస్తూ, బ్రాండ్ కొత్త తరం యువ క్రికెట్ అభిమానులను ఆకట్టుకోవడం లక్ష్యంగా పెట్టుకుందనీ ,ఈ అభిమానులలో అధిక శాతం మంది పెద్దలుగా భారతదేశంలో తమ మొదటి ప్రపంచ కప్‌ను చూస్తున్నారనీ వివారించారు.

టీమిండియా విజయంపై నమ్మకం పెంచుతున్న థమ్స్ అప్, షారుఖ్ ఖాన్ వాయిస్ ఆఫ్ బిలీఫ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : థమ్స్ అప్, కోకా-కోలా కంపెనీకి చెందిన భారతదేశ స్వదేశీ పానీయాల బ్రాండ్, ఇప్పుడు "తేరే అందర్ కా హర్ షక్ మిటాయేంగే, తూఫాన్ హైన్, కప్ టు హమ్ హీ ఉఠాయేంగే" అనే ప్రచారాన్ని ప్రారంభించడం ద్వారా ఐసీసీ పురుషుల క్రికెట్ ప్రపంచ కప్‌తో దాని అసోసియేషన్ యొక్క మరొక అధ్యాయాన్ని ఆవిష్కరించిందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రచారం క్రికెట్ అతి పెద్ద అభిమాని, 'వాయిస్ ఆఫ్ బిలీఫ్' బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ తో టీమ్ ఇండియాకు బలమైన మద్దతును ప్రదర్శిస్తుందన్నారు. ఈ చిత్రంలో షారూఖ్ ఖాన్ ద్విపాత్రాభినయం చేస్తూ, ప్రతి అభిమాని మనసుకు, హృదయానికి ప్రాతినిధ్యం వహించడమే కాకుండా, అంతిమంగా మనస్సును గెలుచుకున్న హృదయంతో, టీమ్ ఇండియాకు దాని స్పష్టమైన మద్దతును ప్రదర్శిస్తుందనీ వివారించారు.

అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్‌కు ఎన్నడూ లేనంత అతిపెద్ద ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): అమెజాన్ ఇండియా రికార్డు స్థాయిలో 9.5 కోట్ల మంది వినియోగదారుల సందర్శనలతో 48 గంటల షాపింగ్‌ను చూసినట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. వేలాది మంది విక్రేతలు తమ అత్యధిక ఒకే రోజు విక్రయాలను సాధించడంతో, ఇది వారి పండుగ సీజన్‌లో అత్యుత్తమ ప్రారంభంగా భావించారు. . "అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2023కి ఈ ఉత్సాహభరితమైన ప్రారంభానికి మా కస్టమర్‌లు, బ్రాండ్, బ్యాంక్ భాగస్వాములు, విక్రేతలు, డెలివరీ అసోసియేట్‌లకు పెద్ద కృతజ్ఞతలు" అని అమెజాన్ ఇండియా కన్స్యూమర్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ అండ్ కంట్రీ మేనేజర్ మనీష్ తివారీ అన్నారు.

ఐడీఏతో సెన్సొడైన్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : హేలియన్ నుండి ఒక అగ్రగామి నోటి సంరక్షణ బ్రాండ్ అయిన సెన్సొడైన్, ప్రపంచ దంతవైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా తమ రోగుల మంచి నోటి సంరక్షణను చూసుకోవడంలో దంతవైద్యుల పాత్రను గుర్తించి, సంబరం జరుపుకోవడానికి గాను భారత దంతవైద్య సంఘం (ఐడిఏ)తో భాగస్వామ్యం కుదుర్చు కున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. దంతవైద్యుల సమాజంలో ఈ నోటి ఆరోగ్య నిపుణుల పాత్రను గౌరవించడానికి గాను సెన్సొడైన్, ఐడిఏ, సర్వశ్రేష్టమైన రోగి ఫలితాల దిశగా పని చేయడానికి వారికి వీలు కలిగించేలా దంత వైద్య శాస్త్రంలో అత్యాధునిక అంశాలను చర్చించడానికి దంత వైద్యుల కొరకు తనదైన శైలిలోని ఒక వేదికను సంయుక్తంగా ఏర్పాటు చేశాయన్నారు. దంతవైద్య రంగానికి సీనియర్ దంతవైద్యులు చేసిన విశేష సహకారాల కొరకు వారిని సన్మానించడానికి కూడా ఈ వేదిక ఉపయోగించుకోబడిందనీ వివారించారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం లేకుండానే జాతీయ క్రీడల్లోకి..

విశాలాంధ్ర -విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వ సహకారం లేకుండా తొలిసారిగా గోవాలో నిర్వహించనున్న 37వ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బృందం పాల్గొంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ సంఘం (ఏపీఓఏ) అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం తెలిపారు. అక్టోబర్ 26 నుండి నవంబర్ 9 వరకు. జాతీయ క్రీడలు 10 రోజుల్లో ప్రారంభమవుతాయని, అయితే, ఇప్పటి వరకు, జాతీయ క్రీడలలో పాల్గొనడానికి ఏపీ జట్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఆర్థిక సహాయం ప్రకటించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడా సంఘాలతో ఎలాంటి సమావేశం నిర్వహించలేదన్నారు.గురువారం విజయవాడలోని హెూటల్ ఐలాపురంలో జాతీయ క్రీడలకు అర్హత సాధించిన జాతీయ క్రీడలు%--%క్వాలిఫైడ్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ స్టేట్ అసోసియేషన్ల సమావేశంతో ఏపీఓఏ సమావేశం నిర్వహించింది. ఆర్చరీ, అథ్లెటిక్స్ సంఘాలు మినహా మిగిలిన రాష్ట్ర సంఘం ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. సంఘాల సమావేశం ముగిసిన అనంతరం ఏపీఓఏ అధ్యక్షుడు ఆర్కే పురుషోత్తం మీడియాతో మాట్లాడారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి గుర్తింపు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) తమ సంఘంతో సమావేశాన్ని ఏర్పాటు చేయలేదన్నారు.అయితే, నేషనల్ గేమ్స్-క్వాలిఫైడ్ గేమ్స్ మరియు స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం కావాలని శాప్ అధికారులను కోరింది, అయితే వారి నుండి ఎటువంటి స్పందన లేదు, అతను చెప్పాడు. ఈ దశలో ఏపీఓఏ ఖర్చులు భరించి గోవా జాతీయ క్రీడలకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ మునుపటి సంవత్సరంలో ఏపిఓఏ ని మోసం చేసింది. రూ.25 లక్షల ఆర్థికసాయం ప్రకటించినా ఇంతవరకు ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. ఏపిఓఏ అన్ని ఖర్చులను ఖర్చు చేసింది. కానీ, శాప్ క్రీడా సంఘాల మధ్య విభేదాలు సృష్టించింది మరియు ఏపీఓఏ కి బిల్లులు విడుదల చేయలేదు, "అని ఆయన ఆరోపించారు.శాప్‌లో చాలా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, పతకాలు సాధించిన ఏ ఒక్కరికీ ప్రభుత్వం నుంచి నగదు ప్రోత్సాహకాలు అందలేదని ఆరోపించారు. అయితే, ఇతర రాష్ట్రాలు నగదు పురస్కారాలను అందజేసి, పతక విజేతలకు ఉద్యోగాలు ఇచ్చాయని ఆయన తెలిపారు.

శ్రీదేవి శరన్నవరాత్రి ఘనంగా నిర్వహించాలి : గొర్ల

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసి ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే అక్టోబర్ 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరగనున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహెూత్సవాల ఆహ్వాన పత్రికలను వైపిపి పట్టణాధ్యక్షులు గొర్ల శ్రీను ఆవిష్కరించారు. గురువారం స్థానిక దేవస్థానంలో వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ ఉదయం 6 గంటల 45 నిమిషాలకు శరన్నవరాత్రి మహెూత్సవాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. 9 రోజులపాటు విశేష అలంకరణలో అమ్మవారికి జరిగే పూజా కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని శరన్నవరాత్రి వేడుకలను విజయవంతం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చంద్రాల హరిరాంబాబు మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో భక్తుల సైతం తమ సహాయ సహకారాలను అందించి ఆలయ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు జోగా సూర్యప్రకాశరావు, రాజనాల శ్రీనివాసరావు, వెంపల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ అరెస్టును నిరసిస్తూ, ఖండిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం అవనిగడ్డ కొత్తపేట రోడ్డులోని షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. చంద్రబాబు త్వరగా విడుదలై ప్రజాక్షేత్రంలోనికి రావాలని కోరుతూ నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలలో మాజీ జడ్.పి.టి.సి జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్.సి సెల్ జిల్లా నాయకులు మాచవరపు ఆదినారాయణ, అశ్వరావుపాలెం గ్రామ సర్పంచ్ పండ్రాజు లంకమ్మ ప్రసాద్, పార్టీ సీనియర్ నేతలు మండలి రాంమోహన్‌రావు, బచ్చు రఘునాథ్, లుక్కా శ్రీనివాసరావు, చెన్ను గాంధీ, మోగావత్తు గోపి, యలవర్తి చిన్న, పులిగడ్డ నాంచారయ్య, కౌతవరపు వెంకటేశ్వరరావు, రేపల్లె మాధవరావు, గరికిపాటి పోతరాజు, పులిగడ్డ నాంచారయ్య, దాసరి శ్రీను లతో పాటు ఆ పార్టీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు సాగు నీరు అందించాలని కోరుతూ దీక్ష

విశాలాంధ్ర-అవనిగడ్డ : నాగాయలంక కోడూరు మండలాల్లోని కాలువ చివరి భూములకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలని కోరుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం వారం దీక్ష చేస్తున్నట్లు జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు వంతెన సెంటర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద దివిసీమలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లోని కాలువ చివరి భూములకు సాగునీరు అందించాలని కోరుతూ నిరసన దీక్ష చేపడుతున్నట్లు శేషుబాబు చెప్పారు. కావున నియోజకవర్గంలోని 6 మండలాల్లోని జనసేన పార్టీలో పలు హోదాలో ఉన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద ఎత్తున నిరసన దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో అంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సతీమణి, విమల భాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమల భాను చేతుల మీదగా సుమారు రూ.35 లక్షలతో నిర్మించే మండల మహిళా సమైక్య కార్యాలయానికి శంకుస్థాపన చేశారు ... ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా పక్షపాతిగా నిరూపించుకుందని ప్రతి రంగంలోనూ మహిళలకు అవకాశాన్ని కల్పించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని ఆమె అన్నారు మహిళా సమైక్య కార్యాలయం అద్దె భవనాల్లో నిర్మించడంతో చాలీచాలని ఇరుకు గదులతో మహిళలు అనేక ఇబ్బందులను చవిచూసారని సమస్య స్థానిక శాసనసభ్యునికి సమైక్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష వివరించడంతో శాసనసభ్యులు స్పందించి మహిళా సమైక్య కార్యాలయానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు, మహిళలు అందరూ కూడా ఐక్యమత్యంగా ఉండాలని ఇటీవల కాలంలో ప్రతిపక్ష నేత చేసిన అవినీతికి రాజకీయ రంగు పులిమి రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత చర్యలు చేపట్టిందని విచక్షణ రహితంగా వ్యాఖ్యలు చేస్తూ మహిళా మంత్రి అయిన రోజాను తెదేపా నాయకులు దుష్ప్రచారం చేస్తూ మహిళను కించపరచడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు మహిళలందరూ కూడా ఐక్యతగా ఉండాలని రానున్న ఎన్నికలలో వైకాపా విజయకేతనం ఎగిరేలా చూడాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష ప్రాజెక్టు డైరెక్టర్ కే శ్రీనివాసరావు మండల ఎంపీపీ కొలుసు రమాదేవి జడ్పిటిసి యేసుపోగుదేవమని గ్రామ సర్పంచ్ భూక్య సీతమ్మ తదితర పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రముఖులు ఎంపీటీసీలు వెలుగు సిబ్బంది భారీ స్థాయిలో పాల్గొన్నారు.

అమెరికన్ అంకాలజీలో అరుదైన క్యాన్సర్ చికిత్స

విశాలాంధ్ర విజయవాడ వన్ టౌన్ : విజయవాడలోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ ఏవో ఐ మంగళగిరి ఎడమ లియోమియోసార్కోమాకు భాగంలో మెటాస్టాటిక్ చికిత్స చేసింది.లియోమియోసార్కోమా, లేదా ఎల్ ఎమ్ ఎస్ అనేది మృదువైన కండరాలలో పెరిగే అరుదైన క్యాన్సర్. ఈ మృదువైన కండరాలు శరీరం లోని ప్రేగులు, కడుపు, మూత్రాశయం మరియు రక్తనాళాలతో సహా శరీరంలోని బోలు అవయవాలలో ఉంటాయి. ఆడవారిలో, గర్భాశయంలో కూడా ఈ మృదువైన కండరం ఉంటుంది. 61 ఏళ్ల పురుషుడు, శ్రీ శ్రీహరి గుణశేఖర్ 2020లో లియోమియోసార్కోమాతో బాధపడ్డారు. ఆయన కొత్త సమస్యతో ఏవో ఐకి వచ్చారు. చెక్-అప్ సమయంలో అతని ఎడమ ఊపిరితిత్తులో కొత్త సమస్య కనిపించింది. డాక్టర్ కళ్యాణ్ పోలవరపు మరియు డాక్టర్ అమిత్ పాటిల్ నేతృత్వంలోని వైద్యుల బృందం అతని సంక్లిష్టమైన కేసును సవాల్ గా తీసుకుంది. ఊపిరితిత్తుల సమస్యతో పాటు, శ్రీ చంద్రశేఖర్ కు బృహద్ధమని, గుండె కవాటాలతో కూడా సమస్యలను శస్త్ర చికిత్స తో విజయ వంతం చేశారు.

ఆర్థరైటిస్తో యువకుల్లో వైకల్యం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : ఆర్థరైటిస్ కారణంగా యువకుల్లో వైకల్యం ఏర్పడుతుందని కామినేని హాస్పిటల్ సీనియర్ జాయింట్ రీప్లేస్ మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ బెజవాడ పాపారావు అన్నారు. ఈ వ్యాధి సోకిన పక్షంలో చికిత్స ప్రారంభించి వ్యాధి ముదిరి వ్యక్తి కదలిక క్రమక్రమంగా తగ్గిపోతాయని అన్నారు. అలాంటి వారిలో రోజువారీ జీవితం పూర్తిగా దెబ్బతింటుందని చెప్పారు. అక్టోబర్ 12న ఆర్థరైటీస్ దినాన్ని పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమంలో మాట్లాడిన డా. పాపారావు.. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 70 కోట్ల మంది ఆర్థరైటిస్ వ్యాధితో బాధపడుతున్నాట్లు తెలిపారు. కీళ్ల వాపులు నొప్పులు వారి జీవితాలను - అతలాకుతలం చేస్తాయని చెప్పారు. సాధారణ ప్రజలలో ఆర్థరైటీస్ గురించి అవగాహన కల్పించాల్సి అవసరం ఉందని పేర్కొన్నారు. ఫిజియోథెరపీ కూడా మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. "ఆర్థరైటిస్ వెన్నెముక రుగ్మతలకు దారి తీస్తుందన్నారు. 80 నుండి 85 శాతం వెన్నునొప్పి కేసులకు నిర్దిష్ట కారణం ఉండదు. యువకులలో వైకల్యానికి ప్రధాన కారణాల్లో వెన్నునొప్పి ఒకటిగా నిలుస్తుంది" అని డాక్టర్ పాపారావు హెచ్చరిస్తున్నారు.

నగరంలో ఎస్ఎస్ అండర్ వాటర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట: నగర వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఏర్పాటుచేసిన ఎస్ ఏస్ అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎక్స్పోను నగర మేయర్ రాయాన భాగ్యలక్ష్మి లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటి వరకు దుబాయ్, మలేషియా, సింగపూర్ ప్రాంతాలకే పరిమితమైన అండర్ వాటర్ టన్నెల్ ఫిష్ ఎక్స్పోను ఇప్పుడు నగరంలోని ఒన్ టౌన్ ప్రాంత సందర్శకుల కోసం ఏర్పాటు చేయడం అభినందనీయమని అమె పేర్కొన్నారు.భవనిపురంలో ఏస్ ఏస్ అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎక్స్పో ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ రాయాన భాగ్యలక్ష్మి విచ్చేసి ఎక్స్పో ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ఆటలు, ఆహ్లాదానికి అందరూ దూరం అవుతున్న వేళ నగరంలో కొత్త ప్రపంచం ఆవిష్కృతమైందన్నారు. అండర్ టన్నెల్ వాటర్ లో రకరకాల చేపలు వున్నాయని ఈ చేపలు కనువిందు చేస్తున్నాయని చిన్నా పెద్దా తేడా లేకుండా అందరిని ఈ ఏస్ ఏస్ అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎక్స్పో అలరిస్తుందని చెప్పారు. తదనంతరం నిర్వాహకులు జీ. కార్తిక్ మాట్లాడుతూ....ఏస్ ఏస్ అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎక్స్పో లో కనీవినీ ఎరుగని రీతిలో రంగు రంగుల చేపలతో ఈ ఎక్స్పో అందరికీ ఆహ్వానం పలుకుతుందన్నారు .టన్నెల్ లో రెండు వేల రకాల చేపలు ఎక్స్పో కే ప్రత్యేక ఆకర్షణగా నిలువడంతో పాటు చూపుతిప్పుకోకుండా చేస్తుంటాయని తెలియజేశారు.అంతే కాకుండా జెయింట్ వీల్, కొలంబస్, టోరాటోరా, బ్రేక్ డ్యాన్స్, చిన్న పిల్లల ఆటవస్తువులు ఈ ఎక్స్పో లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తూ ఇటు చిన్నారులు, అటు పెద్దవారికి ఆహ్లాదంతో పాటూ ఆనందాన్ని పంచుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.నగర వాసులు తప్పక ఏస్ ఏస్ అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎక్స్పో ను సందర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇర్ఫాన్, నిర్వహకులు బి.నారాయణ,అడపా ప్రభాకర్, మేనేజర్ సత్య తదితరులు పాల్గొన్నారు

పండుగ సందర్భంగా ఫ్లిప్ కార్ట్ వావ్ డీల్స్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: పండుగ సందర్భంగా ఫ్లిప్కార్ట్ సంస్థ తమ వినియోగదారుల కోసం ఆకాశంలో ఏమైనా ఆఫర్లను ప్రవేశపెడుతున్నట్లు ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.ఫ్లిప్కార్ట్ యొక్క 'బిగ్ బిలియన్ డేస్' మిలియన్ల మంది భారతీయ కస్టమర్లు, ఎంఎస్ఎంఇలు, కళాకారులు, బ్రాండ్లు పెద్ద పర్యావరణ వ్యవస్థకు విలువ సౌకర్యా న్ని అందించడం ద్వారా పండుగ స్ఫూర్తిని పొందుతుందన్నరన్నారు. స్మార్ట్ ఫోన్ షాపింగ్ అవసరాల కోసం ఉత్తమ ఆఫర్లు,ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, ఫ్లిప్ కార్ట్ పాత స్మార్ట్ ఫోన్లు ,ఫీచర్ ఫోన్లు సహా పనిచేయని ఫోన్లకు కూడా మార్పిడి సౌకర్యం అందిస్తుందనీ తెలిపారు. కస్టమర్లు ఎక్స్ఛేంజ్ బోనస్ లను ఆశించవచ్చనీ ఉత్పత్తి పేజీలో విడ్జెట్తో వారి స్మార్ట్ ఫోన్లకు ఉత్తమ విలువను కనుగొనవచ్చ చెప్పారు. ఫ్లిప్కార్ట్ ఉత్తమ స్మార్ట్ఫోన్లను, వినియోగదారులకు అందుబాటులో తీసుకురావటం కొనసాగిస్తుందనీ వివారించారు. ఆందోళన లేని షాపింగ్ అనుభవం కోసం, ఫ్లిప్కార్ట్ ఓపెన్ బాక్స్ డెలివరీని అందిస్తుందన్నారు.

విద్యార్థులు ఉపాధి కోర్సులుపై దృష్టి సారించాలి

-ఘనంగా నలంద ఫెషర్స్ డే వేడుకలు
-ప్రత్యేక ఆకర్షణగా నలంద ఫ్యాషన్ షో,

విశాలాంధ్ర- విజయవాడ ఎడ్యుకేషన్: నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యా సంస్థల్లో నూతన కోర్సులను రూపకల్పన చేశామని, 'విద్యార్థులకు ఉపాధి అవకాశాలు గల కోర్సులను ప్రారంభించామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా మండలి సెక్రటరీ ప్రొఫెసర్ నజీర్ అహ్మద్ అన్నారు. నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నందు నలంద డిగ్రీ కళాశాల 'ఫ్రెషర్స్ డే 2023 వేడుకలు ఉదయం జరిగాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ శ్రీ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ ఉపాధి అధారిత కోర్సులను డిగ్రీ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఈవిద్యా సంవత్సరం ఎన్నో కొత్త కోర్సులు వచ్చాయని వాటి వలన విద్యార్థుల్లో ఆల్రౌండర్ నైపుణ్యం పెరుగుతుందని. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్కు అత్యధిక ప్రాధన్యత ఇచ్చినట్లు తెలిపారు. అలాగే విద్యార్థులు కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను, తీసుకువస్తుందని వాటిని కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. " విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాలపై ఆసక్తితో పాటు, పరిశోధించే అవకాశం కూడా ఉండాలని అప్పుడే మంచి నైపుణ్యత కలిగిన వ్యక్తిగా విద్యార్థి ఎదుగుతాడని అన్నారు. నలంద డిగ్రీ, కళాశాల చక్కని కోర్సులను అందించడంతో పాటు విద్యార్థులకు అన్ని అంశాల్లో శిక్షణ ఇచ్చి ప్రతి విద్యార్థిలో నైపుణ్యతను పెంపొందిస్తున్నారని ఈసందర్భంగా నలంద విద్యా సంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. నలంద విద్యా సంస్థల చైర్మన్ ఎ.విజయబాబు మాట్లాడుతూ నలంద డిగ్రీ కళాశాలలో యూనివర్శిటీ సేన్ తో పాటుగా అదనపు కోర్సులను కూడా అందిస్తున్నామని దీని వలన విద్యార్థికి డిగ్రీతో పాటు. ఉపాధి అవకాశాలు పొందుతారని అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో ప్రతి ఏటా నిర్వహించే క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎక్కువ మంది. విద్యార్థులు ఉపాధి పొందుతున్నారని, ఉపాధి అవకాశాలకు నలంద డిగ్రీ కళాశాల అత్యధిక ప్రధాన్యత ఇస్తుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. 'అనూరాధ తోలుత వార్షిక నివేదికను అందించారు. నలంద డిగ్రీ కళాశాలలో విద్యార్థి సమగ్ర వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగంతో పాటు, విద్యార్థికి అవసరమయ్యే అన్ని రకాలైన కోర్సులను రూపకల్పన చేసి తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. తమ విద్యార్థులకు చదువుతో పాటు కోడలు, సాంస్కృతిక, సామాజిక అంశాలలో కూడా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో యూనివర్శిటీ కరీడల్లో తమ విద్యార్థులు ప్రతి ఏటా ప్రతిభ కనపరుస్తున్నారని క్రికెట్లో కూడా తమ విద్యార్థి భారత జట్టుకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. అలాగే వివిధ సామాజిక " కార్యక్రమాల్లో కూడా తమ విద్యార్థులు చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. ప్రత్యేకంగా ప్లేస్మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేసి నిత్యం వివిధ కార్పొరేట్ సంస్థలతో క్యాంపస్ ఇంటర్వ్యూలను నిర్వహించి ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశం అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం నలంద డిగ్రీ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులచే ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం చెపుతూ ద్వితీయ. " సంవత్సరం విద్యార్థులు నీని, పాశ్చాత్య, వ్యాస్సులతో అదరగొట్టారు. నలంద, విద్యార్థులచే నిర్వహించిన ఫ్యాషన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.